క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఉద్దేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి అన్నారు. గురువారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్‌గన్యా లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గన్యా లాంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడి



నెరిమెట్ల గ్రామం వద్ద వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ శుభకర్

ఉరవకొండ: వేరుశనగ సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, తద్వారా దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ గురువారం రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ వేరుశనగకు లద్దెపురుగు ఆశిస్తుందన్నారు. పంటకు పురుగు పట్టకుండా ఉండటానికి రైతులు క్వినాల్ ఫాస్ 2 ఎంఎల్ లీటర్ నీటితో పిచికారీ చేయాలన్నారు. లేదంటే మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లీటర్ నీటికి పిచికారీ చేయాలన్నారు. ఆముదం పంటకు ఆశించే లద్దె పురుగు నివారణకు ఇదే తరహాలో పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. పంటలకు చీడపీడలు ఆశించకుండా పంట చుట్టూ సజ్జ, జొన్న, నాలుగు వరుసలతో ఒత్తుగా విత్తుకుంటే దాదాపు తల్లి పురుగులను పంట మీదకు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన కౌలు రైతులతో ఏఓ సమావేశం నిర్వహించి, సచివాలయాల ప్రాంగణాల వద్ద మొక్కలు నాటారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలని వినతి



ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం ఏవో సూరికి ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు నవీన్, సహాయ కార్యదర్శి అజయ్, పట్టణ అధ్యక్షులు హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు సాయి పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని దురదకుంటలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ శ్రీనివాసుగుప్త గురువారం తెలిపారు. ఈ శిబిరంలో గొర్రెలు, మేకలు, కోళ్లు, పశువులకు దీర్ఘకాలిక వ్యాధులు, చికిత్సతోపాటు ఉచితంగా మందు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి



శీర్పిలో ఆధార్ స్పెషల్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. గురువారం మండల పరిధిలోని కాలువపల్లి, శీర్పి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ఈఓఆర్డీ మాధురెడ్డితో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. ఆయా సెంటర్ల అధికారులకు నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. క్యాంపులకు కేటాయించిన రెండు రోజుల పాటు నిర్వహించాలన్నారు. 26న కాలువపల్లి, శీర్పి, 27న గుండ్లపల్లి, రామసాగరం గ్రామాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవి, ఉమాదేవి, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. ప్రాణాలు సురక్షితం



ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. ఇంటి పెద్ద, చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం పడే వేదన వర్ణనాతీతం. ద్విచక్రవానం నడిపే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా శిరస్త్రాణం ధరించాలి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. హెల్మెట్ ధరించడం భారంగా అనుకోవద్దు.. ప్రతి ఒక్క వాహనదారుడు బాధ్యతగా భావించాలి. ప్రస్తుతం ఈ నిబంధనలు పక్కాగా అమలు చేసేలా దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో స్వయాన అన్ని నియోజకవర్గాల్లోనూ న్యాయమూర్తులే నేరుగా హెల్మెట్‌పై సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తూ, ర్యాలీల్లోనూ పాల్గొని, ప్రజలను, వాహనదారులను చైతన్యపరుస్తున్నారు.

– రాయదుర్గం:

- హెల్మెట్ వాడకపోవడంతో ప్రమాదాలు అధికం
- న్యాయస్థానం ఆదేశాలతో పక్కాగా అమలుకు చర్యలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

• రాయదుర్గం మండలం వైస్ ఎంపీపీ కావలి సత్యనారాయణ, జుంజురంపల్లి మంజునాథ ఇద్దరు కలసి ఒకే ద్విచక్ర వాహనంపై ఇటీవల గ్రామానికి బయల్దేరారు. మార్గం మధ్యలో గుమ్మఘట్ట మండలం దేవరెడ్డిపల్లి క్రాస్ సమీపాన రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే ఇద్దరూ మృత్యువాతపడ్డారు.

• వారంరోజుల క్రితం మేనమామతో కలిసి ద్విచక్రవాహనంపై ఇద్దరు విద్యార్థులు వెళ్తుండగా, గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి క్రాస్ సమీపాన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారులు ఇద్దరూ మృతి చెందారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

• డి హీరేహాళ్ మండలంలోని ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడుపుతున్నాడు. కల్వం దాటగానే కుక్క అడ్డురావడంతో ఉన్నపళంగా బ్రేక్ వేశాడు. దీంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు హెల్మెట్ ఉండడంతో చిన్న గాయాలతో బయటపడ్డాడు. చాలా మంది ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో పోలీసుల జరిమానాకు భయపడో లేక హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చనో వెంట తెచ్చుకుంటారు... కానీ దాన్ని నెత్తిమీద కాకుండా ద్విచక్ర వాహనానికి తగిలిస్తున్నారు. ఇలా చేయడంతో వల్ల ప్రాణాలు కాపాడుకోలేకపోతున్నారు. ఇలా ఎన్నో ఘటనలు.. తరచూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారని తెలుస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర రహదారులు కూడా ఉన్నాయి. వీటికి అనుసంధానంగా ఉండే ప్రధాన రహదాల్లో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో లెక్కిస్తే ఎక్కువశాతం ద్విచక్ర వాహనాలే కనిపిస్తాయి. చిన్న పొరపాటు వల్ల పెద్ద మూల్యం చెల్లుచుకోవాల్సి వస్తోంది. రోడ్డు ప్రమాదాల కారణంగా కొందరు గాయాల పాలు కాగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. నమ్ముకున్న కుటుంబాలను నట్టేట ముంచేసి వెళ్తారు. మూడు నియోజకవర్గాల్లోనూ గడిచిన మూడేళ్లలో రోడ్డు ప్రమాదాలతో సుమారు 134 మృత్యువాత పడగా, 412 మందికి పైగా గాయాలపాలయ్యారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి సుమారు వెయ్యికి పైగా ఫైనులు వేసి ఉంటారు. అయినా చాలా మందిలో మార్పు కనిపించడం లేదు.

పక్కాగా అమలుకు చర్యలు :

రహదారి ప్రమాదాల సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. ఇందులో సింహభాగం ద్విచక్ర వాహనాలే ఉండడం.. బాధితుల్లో ఎక్కువ మంది తలకు గాయాలు అయ్యి ఉండడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం హెల్మెట్ తప్పని సరిచేస్తూ ఇటీవల న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దాన్ని పక్కాగా అమలు చేసేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

హెల్మెట్ లేకుండా రోడ్డెక్కితే చర్యలు



న్యాయస్థానం ఆదేశాల మేరకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం రోడ్డెక్కితే ఇకపై కఠిన చర్యలు చేపడతాం. ఎంతటి వారైన సరే ఇందులో రాజీపడేది లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో హెల్మెట్ ఎంత అవసరమో ఓ సారి వాహనదారులే ఆలోచించుకోవాలి. ద్విచక్ర వాహనం బయటకు తీయగానే ఇంట్లో వారైన సరే నెత్తిన హెల్మెట్ పెట్టాకే బయటకు పంపాలి. ప్రాణాలకు రక్షణగా ఉండే ఈ జాగ్రత్తలు తప్పక పాటించాలి. న్యాయ మూర్తులే నేరుగా రోడ్డుపైకి వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా నాణ్యమైన హెల్మెట్‌నే వాడాలి. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఈ అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయించాం.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడకండి.. ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో ఆయన అనంతపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకొచ్చాక వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పై, వారి ఆస్తులపై దాడులకు పాల్పడడం చేస్తోందని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని హితవుపలికారు. టీడీపీ నేతల దౌర్జన్యాలను, అరాచకాలను ఎలా ఎదుర్కోవాలి..? ఏవిధంగా పోరాటాలు చేయాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. ఎక్కడైనా కార్యకర్తలు లేదా నాయకులపై టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగితే సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు , పార్టీ నేతలు అందరూ ఏకమై వారికి అండగా నిలవాలని సూచించారు. ప్రజాసామ్య పద్ధతిలో పోరాటం చేస్తూ, టీడీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలను అరికడదామని పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి రాష్ట్రంలో చేస్తున్న విధ్వంసాలు, అరాచకాలు, దాడులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేసి దేశమంతటా తెలిసేలా చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవా, పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాల నేతలు,పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు .

పారిశుధ్య పనుల పర్యవేక్షణ తప్పనిసరి



గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు

కంబదూరు: గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ సిబ్బంది తప్పనిసరిగా పర్యవేక్షించాలని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు సూచించారు. గురువారం మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలు (ఓడీఎఫ్)పై గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. ట్యాంకులను నీటితో నింపినప్పుడెల్లా క్లోరినేషన్ చేయించి నీటిని సరఫరా చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ వనజ అక్కమ్మ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కౌడిపీర్ల పెద్ద సరిగెత్తు



ఉరవకొండ రోడ్డులో కొలువుదీరిన చిన్నపీర్లు



ఆంజనేయస్వామి, హస్సేన్ హుస్సేన్ పీర్లచావిడిలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో చిన్నమొహర్రం (కౌడీ పీర్లు) వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో వెలసిన పీర్లచావిడిల్లో గురువారం రాత్రి 9వ రోజు పెద్ద సరిగెత్తు నిర్వహించారు. కులమతాలకతీతంగా పీర్ల మకాన్‌లలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక పూజలు, ఫాతెహాలు పఠించారు. కురాగులగుట్ట ఆంజనేయస్వామి హస్సేన్, హుస్సేన్ పీర్లమకాన్, జీఆర్ఎస్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, చర్చి ఏరియా, మధు టాకీస్ ఏరియా, పాటిల్‌నగర్, ఓబుళాచారి రోడ్డు, ఊరువాకిలి, కూరగాయల మార్కెట్ వద్ద తదితర ప్రాంతాల్లోని పీర్ల చావిళ్లను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. కురాకులగుట్ట ఆంజనేయస్వామి హుస్సేన్ హస్సేన్ పీర్ల చావిడి వద్ద వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండాల వద్ద రాత్రంతా తప్పెట్లతో అలాయి ఆడారు. పీర్ల చావిడిలో భక్తులు చెక్కర, బెల్లం చదివింపులు గావించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా హస్సేన్ హుస్సేన్ పీర్ల మకాన్ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు. వేడుకల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఉరువాకిలి వద్ద పీర్ల ఊరేగింపు అనంతరం జలధి ఉత్సవం ఉంటుందని ముజావర్లు తెలిపారు.

ఘనంగా పెద్దసరిగెత్తు

కణేకల్లు: కణేకల్లులో చిన్నపీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా నాలుగు రోజుల క్రితం ఉరవకొండ రోడ్డులోని పీర్లచావిడిలో చిన్నపీర్లను కొలువుదీర్చి.. గురువారం పెద్దసరిగెత్తు నిర్వహించారు. పీర్లకు నూతన వస్త్రాలు, వెండి ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పీర్లచావిడి ముందు పెద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు చిన్నపీర్లను దర్శించుకుని చెక్కరతో ఫాతెహాలు జరిపించారు. చిన్నపీర్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి

కూడేరు: మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా గురువారం కూడేరు మండల పరిధిలోని పి.నాగిరెడ్డి పల్లిలో పీర్ల దేవుళ్ల జలధి కార్యక్రమాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పీర్ల మసీదు వద్దకు వెళ్లి పీర్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలవురు పిల్లలు, పెద్దలు డప్పుల నడుమ చిందులు తొక్కారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

ఆధార్ క్యాంపుల పరిశీలన

కుందుర్పి: మండలంలోని నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. గురువారం ఎర్రగుంట, ఎనుములదొడ్డి సచివాలయాల్లో నిర్వహించిన ఆధార్ క్యాంపులను వారు పరిశీలించారు. శనివారం వరకు ఆధార్ క్యాంపులు ఉంటాయని, ఈరెండు రోజులు ఆధార్ సమస్యలు ఉన్న వారు ఆయా గ్రామాలకు వెళ్లి సరిచేసుకోవాలని తెలియజేశారు. శుక్రవారం బసాపురం, ఎనుములదొడ్డి-2 సచివాలయాల్లోను, శనివారం నిజవళ్లి, మహంతపురం సచివాలయాల్లోనూ ఆధార్ క్యాంపులు ఉంటాయని సూచించారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు

రాయదుర్గం (డీ హీరేహాళ్): డీ హీరేహాళ్ మండలంలోని చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులను చితకబాదాడు. ఈ విషయం గురువారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన మేరకు.. నాల్గో తరగతి విద్యార్థులు అల్లరి చేస్తున్నారనే కారణంతో సహనం కోల్పోయిన ఓ ఉపాధ్యాయుడు బెత్తంతో చితకబాదాడు. దీంతో విద్యార్థులు మునుకన్నయ్య, జశ్వంత్, ఐశ్వర్య, ప్రభాస్‌తో పాటు మరికొందరికి వాతలు పడ్డాయి. విద్యార్థులు ఇంటికెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు విషయం తెలిసింది. అల్లరి చేస్తున్నారని ఇంతలా చితకబాదడం ఏమిటని వారు నిలదీశారు. జరిగిన ఘటనపై ఎంఈఓ లక్ష్మన్నకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంఈఓను అడగ్గా విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. శుక్రవారం పాఠశాలలో విచారణ చేస్తామని తెలిపారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

నిండుకుండను తలపిస్తున్న కణేకల్లు చెరువు



తుంగభద్ర జలాలతో నిండుగా ఉన్న కణేకల్లు చెరువు

కణేకల్లు: హెచ్చెల్సీకి మినీ రిజర్వాయర్‌గా ఉన్న కణేకల్లు చెరువు తుంగభద్ర జలాలతో కళకళాడుతోంది. ఈనెల 22న తుంగభద్ర డ్యాం వద్ద హెచ్చెల్సీ నీటిని విడుదల చేయగా, మంగళవారం సాయంకాలం ఆంధ్ర సరిహద్దు 105 కిలోమీటరు వద్ద నీరు చేరింది. గురువారం ఉదయం తుంగభద్ర జలాలు కణేకల్లు చెరువులో ప్రవేశించాయి. వచ్చిన నీటిని యథావిధిగా హెచ్చెల్సీ అధికారులు దిగువకు విడుదల చేశారు. ఆంధ్రా సరిహద్దులో 500 క్యూసెక్కుల నీరు వస్తోంది. శుక్రవారం ఉదయం నుంచి 750 క్యూసెక్కుల నీరు రానున్నట్లు డీఈఈ మద్దిలేటి తెలిపారు. కెనాల్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్రమేపీ నీటిమట్టాన్ని పెంచుకుంటూ వస్తామన్నారు. మూడు నెలల నుంచి నీరు లేక బోసిపోయిన కణేకల్లు చెరువుకు తుంగభద్ర జలాలు చేరి, కళకళలాడుతోంది.

31న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31న మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశ్రాఫ్‌ఆలీ, అధ్యాపకులు సురేష్‌బాబు తెలిపారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పాలిసెట్ తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో మిగిలి ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, నిర్దేశించిన ఫీజుతో ఈనెల 31న ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాలన్నారు. వివరాలకు సెల్: 9177942568లో సంప్రదించాలన్నారు.

పాలిటెక్నిక్‌లో తక్షణ ప్రవేశాలు..

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ గురువారం తెలిపారు. పదో తరగతి పాసై ఆసక్తిగల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 29లోపు కళాశాలలో అందించాలన్నారు. 4 నుంచి పది వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, ఆధార్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, 3 సెట్లు జిరాక్స్ తీసుకొని, కోర్సు ఫీజు రూ.5,800తో విద్యార్థులు హాజరుకావాలన్నారు.

షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట్ట: పశువులు, గొర్రెలు, కోళ్ల ఫారం షెడ్ల కోసం అర్హులైన నిరుపేద, సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యులు నవీన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 50 యూనిట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పశువుల షెడ్డుకు 90 శాతం సబ్సిడీ, గొర్రెలు, కోళ్ల ఫారంలకు 70శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.

చోళసముద్రం, జయపురం డీలర్ల రాజీనామా

కూడేరు: మండలంలోని చోళసముద్రం, జయపురం గ్రామాలకు చెందిన రేషన్ షాపు డీలర్లు కురుబ లక్ష్మి, సునీత గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు అందజేశారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలు

కూడేరు: అర్హులైన కౌలు రైతులందరికీ సాగు హక్కు పత్రాలు అందించి, ప్రభుత్వ పథకాల ద్వారా కలిగే లబ్ధి వర్తించేలా కృషి చేస్తామని ఏఓ విజయకుమార్ తెలిపారు. గురువారం కూడేరు, ఇప్పేరు రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతుల సాగు హక్కుల పత్రాల మంజూరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఈఓ శైలజ, వీఏఏ ఓబులేసు, వీహెచ్ఏ సాజియా, ఎంపీఈఓ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి రైతుకు గాయాలు



ఆటో బోల్తా ఘటనలో గాయపడిన రైతు లతీఫ్

కణేకల్లు: మండలంలోని మాల్యం-సొల్లాపురం గ్రామం మధ్య ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్తున్న ఆటో గురువారం సాయంత్రం బోల్తా పడి ఓ రైతు గాయపడ్డాడు. వివరాలు.. కణేకల్లుకు చెందిన రైతు లతీఫ్ పొలంలో ట్రాన్స్‌ఫార్మార్ కాలిపోవడంతో ఉరవకొండ నుంచి ఆటోలో తీసుకొస్తున్నాడు. మార్గంమధ్యలో ఆటో బోల్తా పడింది. అందులో లతీఫ్‌తోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. లతీఫ్‌కు చాతీ భాగంలో బలమైన గాయం కాగా, అతన్ని బళ్లారి విమ్స్‌కు చికిత్స కోసం తరలించారు. ఇదిలా ఉండగా, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను రీప్లేస్ చేయించాల్సి ఉన్నా.. ఆ బాధ్యతను కణేకల్లు విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు అంటున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రాయదుర్గం(డి హీరేహాళ్): డీహీరేహాళ్ మండలంలోని పూలకుర్తి వద్ద గురువారం లారీ ఢీకొని మల్లికేతికి చెందిన బోయ రామకృష్ణకు తీవ్రగాయాల పాలయ్యాయి. ద్విచక్ర వాహనం మీదపడటంతో కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు చికిత్స కోసం హుటాహుటినా బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. డీ హీరేహాళ్ మండలంలోని సోములాపురం రైల్వే యార్డు నుంచి లారీల్లో నిత్యం మెయిన్స్ తరలింపు ఎక్కువైంది. దీంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

నీటి కుంటలో పడి నాలుగు గేదెలు మృతి



నీటి కుంటలో పడి మృతి చెందిన గేదెలు

ఉరవకొండ: విడపనకల్లు మండలం ఎస్.తిమ్మాపురం గ్రామ శివారులోని నీటి కుంటలో పడి నాలుగు గేదెలు గురువారం మృతి చెందాయి. వివరాలు.. ఎస్.తిమ్మాపురం గ్రామ శివారులో ఐదు గేదెలు మేతకు వెళ్లాయి. నీరు తాగడానికి సమీపంలో ఉన్న కుంటలోకి దిగాయి. ఇందులో ఒక గేదె అతి కష్టం మీద బయట పడింది. మిగితా నాలుగు గేదెలు మృతి చెందాయి.